RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | మంగళవారం 11-8-2026 | సంచిక: 13 | సంఖ్య: 313 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

## ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు

**పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభలో కేటీఆర్**

దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి కేటీఆర్ నివాళి

**పెద్ది కుటుంబానికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ**

ప్రజల హృదయాల్లో పెద్ది చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడిన కేటీఆర్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘనంగా నివాళు లర్పించారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సంపేటలో నిర్మించనున్న మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టనున్నట్లు కేటీఆర్ కీలక ప్రకటన చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని అగ్రభాగాన నిలిచి నడిపించిన గొప్ప నాయకుడు పెద్ది అని ఆయన కొనియాడారు.



# వర్షాలు కురవాలి..

## మహా వరుణ యాగంలో సీఎం రేవంత్‌రెడ్డి

కృష్ణమ్మకు పూర్ణాహుతి సమర్పణ

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడాలని ప్రార్థన

నాగార్జునసాగర్‌లోని కృష్ణా తీరాన శాస్త్రోక్తంగా వైదిక క్రతువులు

108 మంది రుత్వికులు.. 11 హోమ గుండాలు

నల్లగొండ: రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం నిర్వహించిన మహా వరుణయాగం వేదపండితుల మంత్రోచ్చారణలు, వైదిక క్రతువుల మధ్య శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో సంపూర్ణమైంది. నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ అతిథి

2లో



2లో

## కొలంబియాను కుదిపేసిన భారీ భూకంపం..

### 69 మంది మృతి

**పశ్చిమ కొలంబియాలో 7.4 తీవ్రతతో భారీ భూకంపం**

ప్రకృతి విలయానికి 69 మందికి పైగా మృతి

**వేలాది భవనాలు నేలమట్టం, ఆరు విమానాశ్రయాలు మూసివేత**

బాధితులను ఆదుకుంటామని కొలంబియా అధ్యక్షుడి హామీ

పశ్చిమ కొలంబియాలో సోమవారం సంభవించిన భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో నమోదైన ఈ భూప్రకంపనల కారణంగా 69 మందికి పైగా మరణించారు. వందలాది మంది గాయపడ్డారు. అనేక భవనాలు పేకమేడల్లా కూలిపోవడంతో శిథిలాల కింద ఇంకా చాలామంది చిక్కుకుని



# ఝార్ఖండ్‌లో టెన్షన్..

బారికేడ్లు బద్దలుకొట్టిన విద్యార్థులు.. వాటర్ కేనన్‌ల ప్రయోగం

ఝార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన ఉద్రిక్తం

బారికేడ్లు దాటి అసెంబ్లీ వైపు విద్యార్థుల మార్చ్

అడ్డుకునేందుకు వాటర్ కేనన్లు ప్రయోగించిన పోలీసులు

పేపర్ లీక్‌లపై సీబీఐ దర్యాప్తు కోరుతున్న విద్యార్థులు

13 పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్

2లో

**జార్ఖండ్ విద్యార్థి ఉద్యమం సోమవారం హింసాత్మకంగా మారి రక్తపాతాన్ని సృష్టించింది. ఆందోళనకారులు ఇచ్చిన చలో అసెంబ్లీ పిలుపుమేరకు వేలాది మంది విద్యార్థులు, ఆశావహులు తరలిరావడంతో వారిని అదుపు చేయడంలో విఫలమైన పోలీసులు బలప్రయోగానికి పాల్పడ్డారు.**

రాంచి, ఆగస్టు 10: జార్ఖండ్ అసెంబ్లీ ప్రాంగణం వైపు దూసుకెళ్లిన నిరసనకారులపై పోలీసులు లాఠీలు ఝులిపించారు. వాటర్ కెనన్లు,

## హైదరాబాదీలకు ఏటా 198 గంటల సమయం వృథా

హైదరాబాద్ రోడ్లపై సమయం, రాత్రుళ్లు నిద్ర.. రెండూ ఆవిరి!

ఒక్క ట్రాఫిక్‌లోనే 123 గంటలు నష్టపోతున్న నగరవాసులు

పెరుగుతున్న రాత్రి ఉష్ణోగ్రతలతో 75 గంటల నిద్రకు దూరం

అంతర్జాతీయ సంస్థల అధ్యయనాల్లో ఆందోళనకర విషయాలు



2లో

## 2027 నాటికి భూముల రీసర్వే పూర్తి చేస్తాం

**ఏలూరు జిల్లా కలిదిండిలో 'మీ భూమి--మీ హక్కు' కార్యక్రమం**

కొత్త పట్టాదారు పాస్‌బుక్కులు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు

**గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ రికార్డుల తప్పులను సరిదిద్దుతామని వెల్లడి**

బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్‌తో పటిష్టమైన భద్రతా ఫీచర్లతో కొత్త పాస్‌బుక్కులు

రెవెన్యూ సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ఏకైక ఎజెండా అని స్పష్టం



రాష్ట్రంలో భూ రికార్డుల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని, 2027 నాటికి భూముల రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి, ప్రభుత్వ అధికారిక చిహ్నంతో కూడిన పట్టాదారు పాస్‌బుక్కులను రైతులకు, భూ యజమానులకు అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను పరిష్కరించడమే తమ కూటమి

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో రగడ

**మంత్రి పొంగులేటి వర్సెస్ పాడి కౌశిక్ రెడ్డి**

హన్మకొండ జిల్లా కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో ఉద్రిక్తత

మంత్రులు పొంగులేటి, పొన్నం ప్రభాకర్‌తో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వాగ్వాదం

గత ప్రభుత్వంపై విమర్శలు చేయడంతో వేదికపైనే అభ్యంతరం తెలిపిన ఎమ్మెల్యే

ప్రభుత్వ వేదికపై రాజకీయాలు వద్దంటూ మంత్రులకు హితవు

ఇరువర్గాల నినాదాలతో జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దిన పోలీసులు

## సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆగ్రహం



2లో

**డీఎస్సీ పేపర్ లీకేజీ, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి**

ఈ స్కామ్‌కు బాధ్యత వహిస్తూ మంత్రి లోకేశ్ రాజీనామా చేయాలి

**ప్రజాస్వామ్యంలో ప్రజలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలి**

మీరు స్పందించకపోతే విద్యార్థులు, యువత, ప్రజలు మిమ్మల్ని విడిచిపెట్టరు..

డీఎస్సీ అక్రమాలపై రెండు నెలలుగా వైఎస్సార్‌సీపీ శ్రేణుల పోరాటం చిరస్మరణీయం

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# వర్షాలు కురవాలి..

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, జలాశయాలు జలకళను సంతరించుకోవాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం సోమవారం 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నాగార్జున సాగర్ సమీపంలోని కృష్ణా తీరంలో ఉన్న విజయ విహార్ వేదికగా ఈ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. యాగం ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ ఏడాది రుతుపవనాలు బలహీనంగా ఉండటం, ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ యాగానికి శ్రీకారం చుట్టింది. ఉదయం నుంచి సాగిన ఈ క్రతువులో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు కూడా పాల్గొన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన 108 మంది రుత్విక్కులు, వేద పండితుల పర్యవేక్షణలో 11 హోమ గుండాలతో ఈ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రస్తుతం నాగార్జున సాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, కేవలం 145.65 టీఎంసీల మేర మాత్రమే నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం ఇది సుమారు 518 అడుగుల వద్దే



కొనసాగుతోంది. గత ఏడాది ఇదే సమయానికి జలాశయం నిండుకుండలా ఉందని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి, కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కాలని, చెరువులు నిండి అన్నదాతల పంటలు పచ్చగా ఉండాలన్న సంకల్పంతో ఈ యాగం నిర్వహించినట్లు ప్రభుత్వం అధికారిక ప్రకటనలో పేర్కొంది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.

## సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

అమరావతి: 'డీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ, అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి. ఈ స్కామ్‌కు బాధ్యత వహిస్తూ మంత్రి లోకేశ్ రాజీనామా చేయాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.9 వేల కోట్ల బకాయి.. వసతి దీవెన బకాయి వెంటనే చెల్లించాలి. ఇంటింటికీ బాండ్లు ఇచ్చి, మేనిఫెస్టోలో చెప్పినట్టుగా నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి బకాయిలతో కలిపి చెల్లించాలి. ఇంత స్పష్టంగా విద్యార్థులు, యువత, ప్రజలు చంద్రబాబును డిమాండ్ చేస్తుంటే, వాటిని డైవర్ట్ చేస్తూ తప్పించుకునే ప్రయత్నం చేయడం ఎంత వరకు సమంజసం?' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం చంద్రబాబును నిలదీశారు. ప్రజలు అడుగుతున్న డిమాండ్‌లను అంగీకరిస్తారా? లేక కొడుకును కాపాడుకోవడం కోసం చరిత్ర హీనులుగా మిగిలిపోతారా? అని ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీల్లో లక్షలాదిగా విద్యార్థులు, యువకులు, నిరుద్యోగులు, ప్రజలు పాల్గొన్నారని పేర్కొన్నారు. తప్పు చేసిన ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తూ, స్ఫూర్తిదాయకంగా నిలిచారని అభినందించారు. విద్యార్థులు, యువకుల కోసం, వారి భవిష్యత్తు కోసం గత రెండు నెలలుగా అన్ని వర్గాల మద్దతుతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు చేసిన పోరాటాలు చిరస్మరణీయంగా నిలిచిపోతాయన్నారు. 'చంద్రబాబు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కుల ఉల్లంఘనకు పూనుకున్నారు. పోలీసు బలంతో అణచి వేయాలని చూశారు. నిర్బంధాలు, బెదిరింపులు, నోటీసులను ఖాతరు చేయకుండా, నియంతృత్వానికి ఎదురొడ్డి.. ప్రజలతో కలిసి, లక్షలాది సంఖ్యలో బయటకు వచ్చి గట్టిగా పోరాటం చేశారు. నిర్బంధాలన్నింటినీ ఎదుర్కొంటూ, ప్రతి అడ్డంకినీ అధిగమిస్తూ శాంతియుతంగా ఈ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాం. గడిచిన 74 రోజుల్లో రాష్ట్ర గవర్నర్‌ను కలవడం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ నిర్వహించిన 10 కార్యక్రమాలు.. అశేష ప్రజానీకం మద్దతుతో అత్యంత విజయవంతం అయ్యాయి' అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెల నుంచి ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు

# ఝార్ఖండ్‌లో టెన్షన్..

బాష్పవాయువును ప్రయోగించారు. పోలీసు లాఠీచార్జ్‌లో పలువురు విద్యార్థుల తలలు పగిలి తీవ్రంగా గాయపడ్డారు. బారికేడ్లను ఛేదించుకుని అసెంబ్లీ వద్దకు చేరుకోవడానికి భారీ సంఖ్యలో విద్యార్థులు తరలిరావడంతో పరిస్థితి అదుపుతప్పింది. నిరసనకారులను అదుపు చేసేందుకు పోలీసులు బాష్పవాయువును, జల ఫిరంగులను ప్రయగించారు. త్రివర్ణ పతాకాలు, ప్లకార్డులు చేతబూనిన నిరసనకారులు వాటర్ కెనన్లను పోలీసులు ప్రయోగించిన సమయంలో నృత్యం చేయడం ప్రారంభించారు. కొత్త అసెంబ్లీ భవనానికి దారితీసే జగన్నాథ్‌పూర్ ఆలయ రోడ్డు సమీపానికి చేరుకున్న తమపై పోలీసులు జరిపిన చర్యలో పలువురు గాయపడినట్లు నిరసనకారులు తెలిపారు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(జేపీఎస్‌సీ), జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్(జేఎస్ఎస్‌సీ) నిర్వహించిన నియామక పరీక్షల్లోని అవకతవకల ఆరోపణలకు వ్యతిరేకంగా సాగుతున్న విద్యార్థుల ఉద్యమంలో 17వ రోజున జరిగిన ఈ నిరసన కార్యక్రమం ఆందోళన తీవ్రతను గణనీయంగా పెంచింది. జేఎస్ఎస్‌సీ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్(సీజీఎల్) పరీక్షను రద్దు చేయాలని, అలాగే నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై సీబీఐతో దర్యాప్తు జరపాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. పోలీసు లాఠీచార్జ్‌లో తల పగిలి, తీవ్రంగా గాయపడిన ఇషాంత్ సింగ్ అనే విద్యార్థి తనతో పాటు మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. విద్యార్థులపై పోలీసుల లాఠీ దెబ్బ పడదని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ గతంలో చెప్పారని, ఇప్పుడు జరిగింది ఏమిటని ఆ విద్యార్థి ప్రశ్నించారు.

**ప్రశాంతంగా ప్రారంభమైడ**

పాత అసెంబ్లీ భవనం నుంచి ఉదయం 10 గంటలకు విద్యార్థులు ర్యాలీగా కొత్త అసెంబ్లీ భవనానికి బయల్దేరారు. సుమారు 3 కిలోమీటర్లు నడిచిన తర్వాత వారిని భద్రతా దళాలు అడ్డుకున్నాయి. అసెంబ్లీకి 1.5 కిలోమీటర్ల దూరంలో బహుళ అంచెల బారికేడ్లను పోలీసులు ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో మోహరించిన పోలీసులు, భద్రతా సిబ్బంది బాష్పవాయువుతో సిద్ధంగా ఉన్నారు. విద్యార్థులను అడ్డుకునేందుకు వాటర్ కెనన్లను ప్రయోగించగా నిరసనకారులు రెయిన్‌డ్యాన్స్ చేసి తాము వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేశారు. అనంతరం భద్రతా దళాలు బాష్పవాయువు గోళాలను ప్రయోగించి విద్యార్థులను చెదరగొట్టేందుకు ప్రయత్నించాయి. వేలాదిమంది విద్యార్థులు బారికేడ్లను ఛేదించుకుని అసెంబ్లీని చేరుకోవడానికి ప్రయత్నించడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు.

**జేపీఎస్‌సీ మాజీ చైర్మన్ అరెస్ట్**

నియామక పరీక్షల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలకు సంబంధించి జార్ఖండ్ సీఐడీ పోలీసులు సోమవారం మాజీ జేపీఎస్‌సీ చర్మన్ ఎల్ ఖియాంగ్తేను అరెస్టు చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉద్యోగ విరమణ చేసిన అనంతరం గత ఏడాది ఫిబ్రవరిలో జేపీఎస్‌సీ చైర్మన్‌గా నియమితులైన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ఖియాంగ్తే జూలై 22న తన రాజీనామాను సమర్పించారు. నియామక పరీక్షల్లో అక్రమాలకు సంబంధించి జేపీఎస్‌సీ మాజీ చైర్మన్ ఎల్ ఖియాంగ్తేను అరెస్టు చేశామని సీఐడీ అదనపు డైరెక్టర్ జనరల్ మనోజ్ కౌశిక్ సోమవారం తెలిపారు. జూలై 28 నుంచి ఖియాంగ్తేను నాలుగుసార్లు పోలీసులు విచారించారు.

విద్యార్థుల ఆందోళనను కవరేజ్ చేసినందుకు తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందు పోలీసులు తనను అదుపులోకి తీసుకుని విచారించారని సీనియర్ జర్నలిస్ట్ అమన్ చోప్రా ఆరోపించారు. అసెంబ్లీ వైపు సాగుతున్న నిరసనకారుల ర్యాలీని కవర్ చేస్తున్న పలువురు ఇతర జర్నలిస్టులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారని చోప్రా పేర్కొన్నారు. విద్యార్థుల ఆందోళనకు సంబంధించిన పరిణామాలపై వార్తలు అందించకుండా జర్నలిస్టులను అడ్డుకునేందుకు హేమంత్ సోరెన్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆయన ఆరోపించారు.

# 2027 నాటికి భూముల రీసర్వే పూర్తి చేస్తాం

ప్రభుత్వ ఏకైక ఎజెండా అని ఆయన పునరుద్ఘాటించారు. సోమవారం ఏలూరు జిల్లా, కైకలూరు నియోజకవర్గంలోని కలిదిండిలో జరిగిన 'మీ భూమి--మీ హక్కు' పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లజర్ల దుర్గాభవాని అనే మహిళా రైతుకు అధికారిక చిహ్నంతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌బుక్‌ను అందజేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ.. కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న డబుల్ ఇంజిన్ ప్రభుత్వం బుల్లెట్ వేగంతో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందన్నారు. రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికులకు కేటాయించిన భూములను సెక్షన్ 22–ఏ పరిధిలో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే, తమ ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరించి వారికి పట్టాలు అందించిందని గుర్తుచేశారు.

**గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు**

2019–2024 మధ్య గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం రెవెన్యూ రికార్డులను తీవ్రంగా దెబ్బతీసిందని చంద్రబాబు ఆరోపించారు. భూములు, ఆస్తులను డిజిటల్‌గా 22–ఏ పరిధిలోకి తెచ్చి వివాదాలు సృష్టించారని మండిపడ్డారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భూ సమస్యలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో భూ రికార్డులను శుభ్రపరిచి, క్రమబద్ధీకరించేందుకు 'రెవెన్యూ రికార్డ్స్ రిఫార్మ్స్ 2026'ను ప్రవేశపెట్టినట్లు వివరించారు.

**పటిష్ఠ భద్రతతో కొత్త పాస్‌బుక్కులు**

కొత్తగా జారీ చేస్తున్న పట్టాదారు పాస్‌బుక్కులలో కరెన్సీ నోట్లకు వినియోగించే తరహాలోనే పటిష్ఠమైన భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని సీఎం తెలిపారు. ఆస్తుల వివరాలను మార్చేందుకు వీలులేకుండా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీని, దీనికి అదనంగా క్యూఆర్ కోడ్ వంటి సాంకేతిక భద్రతా ఫీచర్లను పొందుపరిచామన్నారు. రైతుల సమక్షంలోనే రీసర్వే నిర్వహిస్తూ, వారి ఈ-కేవైసీ తీసుకున్నాకే గ్రామసభలు పెట్టి పారదర్శకంగా పాస్‌బుక్కులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 32.22 లక్షల పట్టాదారు పాస్‌బుక్కులు రైతులకు, భూ యజమానులకు అందజేశామని, రాబోయే ఏడు నెలల్లో 9,365 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి 68.64 లక్షల పాస్‌బుక్కులు జారీ చేస్తామని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 41,000 ఎకరాలకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించడం ద్వారా 1.27 లక్షల మంది రైతులకు, పరిశ్రమలకు, ప్రజలకు లబ్ధి చేకూర్చామన్నారు.

# ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "ఎంతకాలం జీవించామన్నది ముఖ్యం కాదు, ఎలా జీవించామన్నదే ప్రధానం. పెద్ది సుదర్శన్ రెడ్డి ఒక్క పర్యాయం ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసేలా పనిచేశారు" అని వ్యాఖ్యానించారు. ఆయన అంత్యక్రియలకు పోటెత్తిన అశేష జనవాహిని, ప్రజల్లో ఆయనకు ఉన్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న సుదర్శన్ రెడ్డి, జులై 31న గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన గతంలో జడ్పీటీసీ సభ్యుడిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సేవలందించడంతో పాటు, 2018–2023 మధ్య కాలంలో నర్సంపేట ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించారు. కాగా, నిన్న ఆదివారం నాడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్రమంలో పార్టీ తరఫున ప్రకటించిన రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇందులో సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లల పేరున ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున, ఆయన తల్లి సంక్షేమం కోసం రూ. 25 లక్షలను కేటాయించారు.

## కొలంబియాను కుదిపేసిన భారీ భూకంపం..

ఉండవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం చోకో ప్రాంతంలోని శాన్ జోస్ డెల్ పల్మార్ పట్టణానికి సమీపంలో, భూమికి సుమారు 107 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రం ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే గుర్తించింది. భూకంప తీవ్రతకు పెరీరా, కాలి, క్విబ్డో, మనీజల్స్ వంటి నగరాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్క పెరీరా నగరంలోనే 18 మంది మరణించినట్లు ఆ నగర మేయర్ మౌరిసియో సలాజర్ తెలిపారు. మనీజల్స్‌లోని చారిత్రక నియో-గోతిక్ కేథడ్రల్ టవర్ ఒకటి కూలిపోయింది. భూకంపం ప్రభావం పొరుగు దేశమైన ఈక్వెడార్‌లో కూడా కనిపించింది. భూకంపం కారణంగా పశ్చిమ కొలంబియాలోని పెరీరా, మనీజల్స్, క్విబ్డో సహా ఆరు విమానాశ్రయాలు దెబ్బతిన్నాయి. దీంతో అధికారులు విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు. అనేక ప్రాంతాల్లో విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు స్తంభించాయి. రాజధాని బొగోటాలోని ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోతున్నారు. కొలంబియా నూతన అధ్యక్షుడు అబెల్లార్డో డి లా ఎస్ప్రియెల్లా వెంటనే సహాయక చర్యలను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నట్లు ప్రకటించారు. జాతీయ విపత్తు నిర్వహణ విభాగంలో యూనిఫైడ్ కమాండ్ పోస్ట్‌ను ఏర్పాటు చేసి, నష్టాన్ని అంచనా వేయాలని, బాధితులకు తక్షణ సాయం అందించాలని ఆదేశించారు. తాను స్వయంగా భూకంప ప్రభావిత ప్రాంతమైన పెరీరాలో పర్యటించి, ప్రభుత్వ సహాయక చర్యలను సమీక్షిస్తానని ఎక్స్ వేదికగా తెలిపారు. "ఈ కష్టకాలంలో ఉన్న కొలంబియా ప్రజలకు నేను చెప్పేది ఒక్కటే.. మీరు ఒంటరి కాదు. ప్రభుత్వం మీకు అండగా ఉంది. ప్రభావిత ప్రాంతాల పునర్నిర్మాణానికి అవసరమైన ప్రతి చర్యా తీసుకుంటాం" అని అధ్యక్షుడు భరోసా ఇచ్చారు. కొలంబియాలో సాధారణంగా చిన్నపాటి భూప్రకంపనలు సంభవిస్తున్నప్పటికీ, 6.0 కంటే ఎక్కువ తీవ్రతతో భూకంపాలు రావడం అరుదు.

## హైదరాబాదీలకు ఏటా 198 గంటల సమయం వృథా

పగలేమో గంటల తరబడి ట్రాఫిక్‌లో నరకయాతన.. రాత్రేమో వేడికి ఉక్కిరిబిక్కిరై నిద్రలేని రాత్రులు.. ఇదీ అంతర్జాతీయ నగరంగా ఎదుగుతున్న హైదరాబాద్‌లో సగటు పౌరుడు ఎదుర్కొంటున్న నిత్య సంఘర్షణ. ఈ జీవన పోరాటాన్ని రెండు వేర్వేరు అంతర్జాతీయ అధ్యయనాలు అంకెల రూపంలో కళ్లకు కట్టాయి. ట్రాఫిక్ రద్దీ, వాతావరణ మార్పుల రూపంలో భాగ్యనగరవాసిపై పడుతున్న జంట దెబ్బల కారణంగా.. ప్రతి ఏటా ఏకంగా 198 గంటల విలువైన సమయం వృథా అవుతోందని ఈ నివేదికలు తేల్చిచెప్పాయి. ఇది దాదాపు 8 పూర్తి రోజులకు సమానం! నెదర్లాండ్స్‌కు చెందిన ట్రాఫిక్ అనలిటిక్స్ సంస్థ 'టామ్‌టామ్ ట్రాఫిక్ ఇండెక్స్', అమెరికాకు చెందిన 'క్లైమేట్ సెంట్రల్' సంస్థలు వేర్వేరుగా నిర్వహించిన పరిశోధనలు ఈ చేదు నిజాన్ని బయటపెట్టాయి. ఈ రెండు నివేదికల సారాంశం హైదరాబాద్ వాస్తవ దుస్థితికి అద్దం పడుతోంది. 'టామ్‌టామ్' నివేదిక ప్రకారం, నగరవాసులు కేవలం ట్రాఫిక్ జామ్‌లలోనే ఏడాదికి సగటున 123 గంటలు (అంటే 5 రోజులకు పైగా) కోల్పోతున్నారు. గత దశాబ్దంలో నగరం శరవేగంగా విస్తరించినా, అందుకు అనుగుణంగా రోడ్ల విస్తరణ, ప్రత్యామ్నాయ రవాణా వ్యవస్థల కల్పన జరగకపోవడమే ఈ దుస్థితికి ప్రధాన కారణమని నివేదిక స్పష్టం చేసింది.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో రగడ

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం నిర్వహించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. మంత్రుల ప్రసంగాలపై స్థానిక హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవంతో పాటు, లబ్ధిదారులకు పట్టాల పంపిణీ నిమిత్తం రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత ప్రభుత్వం పనులను అసంపూర్తిగా వదిలేసిందని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి పనులను పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను అందిస్తోందని వారు పేర్కొన్నారు. మంత్రుల వ్యాఖ్యలపై అదే వేదికపై ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తక్షణమే స్పందించారు. ఈ ఇళ్లను నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వమని, మంత్రులు వాస్తవ విరుద్ధమైన ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "అబద్ధాలు చెప్పవద్దు.. కేవలం నిజాలే మాట్లాడండి. ఇది రాజకీయాలు చేసే వేదిక కాదు, ప్రజలకు వాస్తవాలను వివరించాల్సిన చోటు" అని ఆయన పేర్కొన్నారు. అధికారిక ప్రభుత్వ కార్యక్రమంలో రాజకీయ విమర్శలు చేయడం సరికాదని మంత్రులపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఈ క్రమంలో ఇరు పార్టీల కార్యకర్తలు, మద్దతుదారులు పరస్పరం నినాదాలు చేసుకోవడంతో అక్కడ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.



## సంఘమిత్ర కళాశాల ఫ్రెషర్స్ డేలో

# విద్యార్థుల హంగామా..

### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

**ఘనంగా సంఘమిత్ర డిగ్రీ, పీజీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు**

**విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా వేడుకలు**

**లక్ష్య సాధనకు క్రమశిక్షణ, పట్టుదల, శ్రమ అవసరం: డా. కె. నరేష్**

కూకట్‌పల్లి, ఆగస్టు 10 (నేటి ప్రస్థానం): విద్యార్థుల ఉత్సాహభరిత ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కూకట్‌పల్లిలోని సంఘమిత్ర డిగ్రీ, పీజీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. 'ది అశోక గార్డెన్స్' వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు నృత్యాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కళాశాల కరెస్పాండెంట్ డా. కె. నరేష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాల జీవితంలోనే తమ భవిష్యత్ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకోవాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలంటే క్రమశిక్షణ, పట్టుదలతో పాటు నిరంతర శ్రమ అవసరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశలు, కలలను సాకారం చేసేలా విద్యార్థులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఇక విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేలా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీమతి కె.వి. లావణ్య నరేష్, ప్రిన్సిపల్ ఎస్.ఎన్. మీనాంబిక, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 15న సంగారెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి..

### కోటి మందికి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**ఆగస్టు 15న సంగారెడ్డిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం**

**50 వేల మందితో భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణుల ఏర్పాట్లు**



సంగారెడ్డి, ఆగస్టు 10 (నేటి ప్రస్థానం): తెలంగాణలో అర్హులైన ప్రజలకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నెల 15న సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో సంగారెడ్డిలోని తారా డిగ్రీ కాలేజీ వద్ద ఏర్పాటు చేయనున్న హెలిప్యాడ్, అంబేడ్కర్ స్టేడియంలోని సభా ప్రాంగణాన్ని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం పరిశీలించారు. కార్యక్రమానికి సంబంధించిన భద్రత, వేదిక, ఇతర ఏర్పాట్లపై అధికారులతో వారు చర్చించారు.అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కోటి 5 లక్షల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో రేషన్ కార్డుల జారీ అరకొరగా జరిగిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల విషయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీయమని జగ్గారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ తరఫున సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం పలుకుతామని చెప్పారు.సీఎం పర్యటన సందర్భంగా సంగారెడ్డిలో భారీ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జగ్గారెడ్డి వెల్లడించారు. సుమారు 50 వేల మందితో సభను నిర్వహించేలా కాంగ్రెస్ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నాయని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, పార్టీ నాయకులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని పేర్కొన్నారు.

## బర్త్, డెత్ సర్టిఫికెట్ల కోసం తిరగాల్సిన పని లేదు..

# హైదరాబాద్‌లో కొత్త సిస్టమ్!

### జనన, మరణాల నమోదుకు త్వరలో కొత్త ఆన్‌లైన్ పోర్టల్

### 'సీఆర్ఎస్'పై అధికారులతో జీహెచ్ఎంసీ కమిషనర్ సమీక్ష

### ఆలస్య నమోదుపై కఠిన నిబంధనలు.. సకాలంలో రిజిస్ట్రేషన్‌కు చర్యలు

**హైదరాబాద్, ఆగస్టు 10 (నేటి ప్రస్థనం):** జనన, మరణ ధ్రువపత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన ఇబ్బందులకు త్వరలో తెరపడనుంది. జనన, మరణాల నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేసి, ప్రజలకు వేగంగా సేవలు అందించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కొత్త ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా 'సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్'(సీఆర్ఎస్) పేరుతో ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ పోర్టల్ ద్వారా జనన, మరణాల నమోదును ఆన్‌లైన్‌లోనే చేసుకునే అవకాశం కల్పించనున్నారు.

**కమిషనర్ సమీక్ష...**

కొత్త పోర్టల్ ఏర్పాట్లు, జనన, మరణాల నమోదు ప్రక్రియపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జనన, మరణాల నమోదును సకాలంలో పూర్తి చేసి, ధ్రువపత్రాలను జారీ చేయడం జీహెచ్ఎంసీ ప్రాథమిక బాధ్యతల్లో ఒకటని ఆయన స్పష్టం చేశారు. కొత్త డిజిటల్ విధానం ద్వారా ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఆలస్యమైతే కఠిన నిబంధనలు**

ఇటీవల అమల్లోకి వచ్చిన జనన, మరణాల నమోదు (సవరణ) చట్టం-2026 నేపథ్యంలో కొత్త ఆన్‌లైన్ వ్యవస్థకు ప్రాధాన్యం ఏర్పడింది. జనన లేదా మరణాన్ని నమోదు చేయడంలో ఆలస్యం జరిగితే ఇకపై నిర్దిష్ట అనుమతులు తప్పనిసరి కానున్నాయి.




**సకాలంలో నమోదు.. ప్రజలకు ప్రయోజనం**

ఆలస్యపు నమోదుకు సంబంధించిన నిబంధనలు కఠినతరం కావడంతో జనన, మరణాల నమోదును సకాలంలో పూర్తి చేయడం అత్యంత కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో కొత్త 'సీఆర్ఎస్' పోర్టల్ ద్వారా నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు, ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను సులభంగా అందించేందుకు జీహెచ్ఎంసీ చర్యలు చేపడుతోంది. డిజిటల్ విధానం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే జనన, మరణ ధ్రువపత్రాల జారీ ప్రక్రియ మరింత సులభతరం కానుంది.

ఒకటి నుంచి రెండేళ్లలోపు ఆలస్యంగా నమోదు చేయాల్సి వస్తే జిల్లా మేజిస్ట్రేట్ లేదా సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. రెండేళ్లకు మించి ఆలస్యం అయితే ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నుంచి ఉత్తర్వులు పొందాల్సి ఉంటుంది.



## హక్కులు తెలుసుకుంటేనే ప్రశ్నించే శక్తి..

# రాజ్యాంగంపై అవగాహన అవసరం

**ప్రతి పౌరుడూ హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలి**

**ఆధ్యాత్మిక విలువలు, సామాజిక బాధ్యతపై చైతన్యం అవసరం**

**శాంతి, సామరస్యానికి అవగాహన సదస్సులు దోహదం చేస్తాయి: మాద్రి పృథ్వీరాజ్**

**గుమ్మడిదల(పటాన్‌చెరు), ఆగస్టు 10 (నేటి ప్రస్థానం):** రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలు, చట్టాలపై ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని మాద్రి పృథ్వీరాజ్ అన్నారు. పటాన్‌చెరు శాంతినగర్‌లోని మెథడిస్ట్ చర్చిలో పటాన్‌చెరు నియోజకవర్గ క్రైస్తవ న్యాయ సలహా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక, రాజ్యాంగ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతలను కూడా గుర్తించాలని పృథ్వీరాజ్ సూచించారు. చట్టాలపై అవగాహన ఉంటే హక్కులను పరిరక్షించుకోవడంతో పాటు సమాజం పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక విలువలతో పాటు రాజ్యాంగ విలువలు, చట్టపరమైన అవగాహన, సామాజిక బాధ్యతపై ప్రజల్లో చైతన్యం పెంచే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో శాంతి, సామరస్యం, పరస్పర గౌరవం పెంపొందించడంలో ఇలాంటి అవగాహన సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకుని రాజ్యాంగ విలువలను గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ న్యాయ సలహా మండలి ప్రతినిధులు, మత పెద్దలు, నిర్వాహకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# జగద్గిరిగుట్ట మహిళలకు కొత్త అవకాశాలు..

**ఉపాధి శిక్షణకు స్వచ్ఛంద సంస్థల ముందడుగు**

**మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**నైపుణ్య శిక్షణతో స్వయం ఉపాధి, ఉపాధి అవకాశాల కల్పన**

**కార్పొరేటర్ కొలుకుల జగన్‌తో సంస్థ ప్రతినిధుల భేటీ**



**జగద్గిరిగుట్ట, ఆగస్టు 10 (నేటి ప్రస్థానం):** జగద్గిరిగుట్ట డివిజన్‌లోని మహిళలు, స్థానిక ప్రజలకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి, జీవనోపాధి అవకాశాలను పెంచేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చాయి. ఈ మేరకు శ్వేతిక జీవనోపాధి సేవా ఫౌండేషన్ ప్రతినిధులు, పీసీఐ ప్రతినిధులు సోమవారం స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ప్రతిపాదిత కార్యక్రమాలపై చర్చించారు. శ్వేతిక జీవనోపాధి సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పడిగెల శివకుమార్, కోఆర్డినేటర్ రజియా బేగం, పీసీఐ ప్రతినిధి యశ్వంత్‌రెడ్డి, సోమ శ్రీనివాసులు తదితరులు కార్యక్రమాల వివరాలను కార్పొరేటర్‌కు వివరించారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించి మహిళలను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించడంతో పాటు కుటుంబాల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడటమే తమ లక్ష్యమని తెలిపారు. ఉపాధి శిక్షణ, స్వయం ఉపాధి, జీవనోపాధి అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక స్థాయిలో విస్తృతంగా చేపట్టేందుకు కృషి చేస్తామని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు స్థానిక ప్రజలకు అవసరమైన సహకారం అందించాలని కార్పొరేటర్ కొలుకుల జగన్‌ను కోరారు.



## స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలి

ఆలేరు ఆగస్టు 10 : అమెరికాతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లనురద్దుచేయాలని రైతుసంఘం రాష్ట్రఉపాధ్యక్షులు కొల్లూరిరాజయ్య,ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్. జనార్ధన్కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సంయుక్త కిసాన్ మోర్చా, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో భువనగిరిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారుమాట్లాడు తూ..అమెరికాతో వాణిజ్య ఒప్పందం వల్ల దేశీయ రైతులు, వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటుధరలుకల్పించడంతో పాటు, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు కనీస మద్దతు ధర అమలు చేయాలని డిమాండ్ చేశారు.దేశకార్మికులు పోరాడిసాధిం చుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం కార్మిక హక్కులను హరించడమేనని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకుఅనుకూలం గావ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం తనవిధానాలను మార్చుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కల్లెపు అడివయ్య, జక్క దయాకర్ రెడ్డి, మామిడాల బాలమల్లేష్, పల్లె మల్లారెడ్డి, ఉప్పుల కొమురయ్య, గడ్డం నాగరాజు, తమ్మడి అంజయ్య, సుదర్శన్ రెడ్డి, ఏశాల అశోక్, చిరబోయిన రాజయ్య, ఆర్. ఉదయ్, ఊరడి రామచంద్రు, ఇప్ప రామకృష్ణ, ఏనుగుల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## శాకాంబరి ఉత్సవాల్లో పాల్గొన్న వంగపల్లి అంజయ్య స్వామి



**ఆలేరు ఆగస్టు 10** : సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న శాకాంబరి ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.ఈ సందర్భంగా అంజయ్య స్వామి మాట్లాడుతూ.. లోకకల్యాణం కోసం, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని కోరుతూ ఇటువంటి ఆధ్యాత్మిక ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అమ్మవారి కృపతో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.ఈ ముగింపు కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, మహిళలు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శాకాంబరి ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆర్యవైశ్య సంఘం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎండిపోతున్న పంటలు.. వర్ధకాలవ నీళ్లు విడుదల చేయాలి!

### యాగాలతో నీళ్లు రావు.. మోటార్లు ఆన్ చేస్తేనే వస్తాయి

### బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు నిమ్మల నవీన్ రెడ్డి డిమాండ్



**మాడుగులపల్లి (ఆగస్టు10)ప్రతినిధి :** మాడుగులపల్లి మండలంలో సాగునీరు అందక ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు వర్ధకాలవ ద్వారా తక్షణమే నీటిని విడుదల చేయాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నిమ్మల నవీన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో నీటి ఎద్దడి వల్ల పరిస్థితి అత్యంత అద్వానంగా తయారైందని, పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు అయ్యా ముఖ్యమంత్రి గారూ రైతుల ఆక్రోశాన్ని అర్థం చేసుకోండి యాగాలు చేసినంత మాత్రాన కాలవల్లోకి నీళ్లు రావు, లిఫ్ట్ మోటార్లు ఆన్ చేస్తేనే నీళ్లు వస్తాయి అని ఘాటుగా విమర్శించారు. ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో మోటార్లు స్టార్ట్ చేసి, వర్ధకాలవ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీటిని పారించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. నీటిని వెంటనే విడుదల చేయకపోతే రైతుల తరపున బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు

# కేంద్ర విధానాలపై కార్మికుల ఆగ్రహం.. బొంతపల్లిలో సీఐటీయూ రాస్తారోకో

### మోదీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆందోళన

### దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగిస్తున్నారంటూ కే.రాజయ్య విమర్శ

### లేబర్ కోడ్‌ల రద్దు, ధరలు--నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి డిమాండ్



గుమ్మడిదల, ఆగస్టు 10 (నేటి ప్రస్థానం): కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కే. రాజయ్య పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా చేపట్టిన జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా సోమవారం గుమ్మడిదల మండలం బొంతపల్లి కమాన్ సమీపంలోని ప్రధాన రహదారిపై సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఆందోళనకారులు రోడ్డుపై బైఠాయించడంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ నిలిచిపోయింది.ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కార్మికులు, రైతులు, సామాన్య ప్రజలకు నష్టం కలిగిస్తున్నాయని ఆరోపించారు. దేశ సంపద, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి సమస్యలు తీవ్రతరం అవుతున్నాయని అన్నారు. కార్మిక, వ్యవసాయ రంగాలకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.విద్యుత్ బిల్లు, విత్తన చట్టంతో పాటు ప్రజా వ్యతిరేక బిల్లులను



ఉపసంహరించుకోవాలని రాజయ్య కోరారు. రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు శ్రీధర్‌రావు, భాస్కర్‌రెడ్డి, నాయకులు కమ్మరి రవీందర్‌చారి, వెంకటేశ్వర్లు, జగన్‌రెడ్డి, ఫకీర్, శ్రీరాములు, మహమ్మద్, వాసుదేవరావు, శ్రీనివాసరావు, అప్పారావు, వీరభద్రం, ఆనంద్‌రెడ్డి, గౌసోద్దీన్, నర్సింలు, మున్సిపల్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలే ప్రధాన అజెండా..

### మరోసారి బాధ్యతలు చేపట్టిన కొత్తకొండ సత్యం

### టిడబ్ల్యూజెఎఫ్ పటాన్‌చెరు డివిజన్ కార్యదర్శిగా కొత్తకొండ సత్యం

### జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని హామీ

### యూనియన్లకు అతీతంగా అందరినీ కలుపుకొని పోరాటాలు చేస్తా: సత్యం



**గుమ్మడిదల(జిన్నారం), ఆగస్టు 10 (నేటి ప్రస్థానం):** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం యూనియన్లకు అతీతంగా ఐక్యంగా పోరాటాలు కొనసాగిస్తామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) పటాన్‌చెరు డివిజన్ కార్యదర్శి కొత్తకొండ సత్యం అన్నారు. ఫెడరేషన్ మూడో మహాసభలో కార్యదర్శిగా మరోసారి ఎన్నికైన సందర్భంగా సోమవారం జిన్నారం మున్సిపల్ కేంద్రంలో సీనియర్ జర్నలిస్టులు ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మరోసారి బాధ్యతలు అప్పగించిన జర్నలిస్టులకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వృత్తిపరంగా జర్నలిస్టులకు ఎదురయ్యే ఇబ్బందులు, సంక్షేమానికి సంబంధించిన అంశాలపై నిరంతరం స్పందిస్తామని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని సత్యం తెలిపారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా ఐక్యంగా పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌గౌడ్, మహేష్‌గౌడ్, విజయ్, జింకల శ్రీనివాస్, మున్నీ శ్రీనివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ తల్లి బోనాల్లో సందడి.. ప్రముఖులకు ఘన సన్మానం

### ఫతేనగర్‌లో భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లి బోనాల వేడుకలు

### అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ నేతలు

### కాంచి మహేందర్ ఆధ్వర్యంలో అతిథులకు ఘన సన్మానం

**కూకట్‌పల్లి, ఆగస్టు 10 (నేటి ప్రస్థానం):** ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా ఫతేనగర్‌లోని శ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం అమ్మవారిని ప్రార్థించారు. బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ , బీజేపీ మేడ్చల్--మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్‌రెడ్డి, శంకర్‌యాదవ్, వడ్డేపల్లి రాజేశ్వర్ తదితరులు పోచమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్ ఆధ్వర్యంలో అతిథులను ఘనంగా సన్మానించి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు ఆలయ ప్రాంగణంలో భక్తులతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# ప్రియాంక కుటుంబానికి ప్రభుత్వం అండగా..

## నిందితులకు కఠిన శిక్ష తప్పదు: మంత్రి వాకిటి శ్రీహరి

### ప్రియాంక మృతి ఘటనపై మంత్రి వాకిటి శ్రీహరి తీవ్ర ఆవేదన

### ప్రియాంక మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి - మంత్రి వాకిటి శ్రీహరి

### కుటుంబాన్ని పరామర్శించి.. తండ్రికి ధైర్యం చెప్పిన మంత్రి

### నిందితులకు శిక్ష తప్పే పరిస్థితి లేకుండా చర్యలు

**హైదరాబాద్, ఆగస్టు 10 (నేటి ప్రస్థానం):** వైద్య విద్యార్థిని ప్రియాంక మరణ ఘటనపై తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనకు కారణమైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టకూడదని, కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. గాంధీ ఆస్పత్రి మార్చురీలో ఉన్న ప్రియాంక భౌతికకాయాన్ని మంత్రి వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ సందర్శించి నివాళు లర్పించారు. అనంతరం ప్రియాంక తండ్రిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. ప్రియాంక మృతి అత్యంత విషాదకరమైన ఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘటనపై వెంటనే స్పందించి, ప్రియాంక కుటుంబాన్ని పరామర్శించాలని తమతో పాటు అధికారులను ఆదేశించారని తెలిపారు. ప్రియాంక కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని మంత్రి హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.



నిందితులు చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని తప్పించుకోకుండా న్యాయపరమైన చర్యలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం కూడా కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి కోరారు.





# ఫోర్‌లైన్ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలి

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మర్రి నిరంజన్ రెడ్డి వినతి

**ఇబ్రహీంపట్నం:** నాగార్జునసాగర్‌లో నిర్వహిస్తున్న వరుణయాగానికి వెళ్తున్న తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఇబ్రహీంపట్నం చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు మర్రి నిరంజన్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ముఖ్య సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం ఖానాపూర్ గేట్ నుంచి గురునానక్ కాలేజీ మీదుగా మాల్ వరకు సెంట్రల్ లైటింగ్, డివైడర్‌తో కూడిన ఫోర్‌లైన్ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వేలాది మంది వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు, రైతులు, కూలీలు హైదరాబాద్ వైపు ప్రయాణిస్తుండటంతో ట్రాఫిక్ రద్దీ పెరుగుతోందని, తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఇటీవల తక్కలపల్లి వార్డు మెంబర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని, ప్రజల భద్రత దృష్ట్యా రోడ్డు పనులను సెంట్రల్ లైటింగ్‌తో కలిపి తక్షణమే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, వంట సిబ్బందికి గ్యాస్ సిలిండర్లు అందించాలని కోరగా, మంత్రి వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ రోడ్ల అభివృద్ధికి నాబార్డ్ పథకం ద్వారా నిధులు కేటాయించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి నియోజకవర్గ ప్రజల తరఫున మర్రి నిరంజన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎం పర్యటన వేళ డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నేతల అరెస్ట్

### అక్రమ అరెస్టులను ఖండించిన విద్యార్థి, యువజన సంఘాలు

### ఉద్యోగాలు భర్తీ చేయాలి.. స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి



**నల్లగొండ :-** ముఖ్యమంత్రి నల్గొండ జిల్లా నాగార్జునసాగర్ పర్యటన సందర్భంగా డీవైఎఫ్ఐ నల్గొండ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గాదేపాక సాయి తేజలను నల్గొండ టూటౌన్ పోలీసులు అరెస్టు చేయడాన్ని సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో ప్రజా సమస్యలపై ప్రశ్నించే, నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. విద్యార్థులు, యువత సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన తమను పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేసి విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదని, అక్రమ అరెస్టులకు స్వస్తి పలికి విద్యార్థులు, యువత సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని కోరారు.

# రాంచీలో విద్యార్థుల ఆందోళన

### విద్యార్థుల నిరసనలతో ద్దరిల్లిన రాజధాని

రాంచీ: ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పేపర్ లీక్ ఉదంతంపై విద్యార్థుల నిరసనలు కీలక దశకు చేరుకున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వంతో చర్చలు విఫలం కావడంతో విద్యార్థులు అసెంబ్లీ వరకూ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వివిధ జిల్లాల నుంచి వేలాదిగా విద్యార్థులురాజధాని రాంచీకి తరలివచ్చారు. ప్రభుత్వం తమ డిమాండ్స్‌పై స్పందించాల్సిందేనంటూ విద్యార్థులు నినదించారు. విద్యార్థులు భారీగా తరలివస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం కూడా అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. లా అండ్ ఆర్డర్ సమస్య లేకుండా అనేక జాగ్రత్తలు తీసుకుంది. పలు కూడళ్లు, రహదారులపై బారికేడ్లను ఏర్పాటు చేసింది. సున్నిత పరిస్థితులున్న ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేసింది. భారీగా పోలీసులను మోహరించింది. రాంచీలో నేడు ఇప్పటికే స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. రాజధానికి వచ్చే వారి సంఖ్యను వీలైనంతగా పరిమితం చేసేందుకు పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లాలు, రాష్ట్ర రహదారులపై విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. పేపర్ లీక్స్ ఉదంతంపై ఇప్పటివరకూ పలు మార్లు విద్యార్థులు, ప్రభుత్వం మధ్య చర్చలు జరిగిన విషయం తెలిసిందే. ఈ విషయంపై దృష్టి సారించేందుకు ప్రభుత్వం ఓ ప్రత్యేక ప్యానల్‌ను కూడా ఏర్పాటు చేసింది. అయితే, ప్రభుత్వ చర్యలపై పెదవి విరుస్తున్న విద్యార్థులు గతంలో ప్రకటించినట్లు అసెంబ్లీ వరకూ ర్యాలీ ప్రారంభించారు.

# రంగనాథ్ తీరు మారదా..?

### కోర్టు ఆదేశాలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి హాట్ కామెంట్స్

### హైకోర్టును తప్పుదోవ పట్టిస్తూ కాలయాపన చేయడం సరికాదన్న రాంచందర్‌రావు

### నాదర్‌గుల్‌లో ప్రభుత్వ భూముల పరిరక్షణపై హైడ్రాను నిలదీత

### సీఎం రేవంత్‌రెడ్డి వరుణయాగంపై తీవ్ర విమర్శలు



హైదరాబాద్, ఆగస్టు 10 (నేటి ప్రస్థానం): హైకోర్టు ఆదేశాలు ఇచ్చినా హైడ్రా కమిషనర్ రంగనాథ్ తీరు మారడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. సోమవారం మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన హైడ్రా వ్యవహారశైలిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కోర్టును తప్పుదోవ పట్టిస్తూ కాలయాపన చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. నాదర్‌గుల్ ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ వాటిని హైడ్రా ఎందుకు పరిరక్షించడం లేదని రాంచందర్‌రావు ప్రశ్నించారు. అక్కడ ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో హైడ్రా అన్ని ప్రాంతాల్లో సమానంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. హైడ్రా వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడామని చెబుతోందని, అయితే ఆ భూములు ఎక్కడ ఉన్నాయో ప్రజలకు ఎందుకు చూపించడం లేదని రాంచందర్‌రావు నిలదీశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు మజ్లిస్‌పై ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదంటూ విమర్శించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, అక్రమ నిర్మాణాల విషయంలో హైడ్రా పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన వరుణయాగంపైనా రాంచందర్‌రావు విమర్శలు గుప్పించారు. వానాకాలం దాదాపు ముగిసిన తర్వాత వరుణయాగం నిర్వహించడం కొత్త నాటకంలా ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం ఉన్న విషయం ముఖ్యమంత్రికి తెలియదా అని ప్రశ్నించారు. సీఎం వరుణయాగం చేస్తే.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొట్టుకుపోవాలని తాము వాయుయాగం చేస్తామంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా పటాన్‌చెరు బోనాల వేడుకలు

### అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్ష.

**ఆగస్ట్ 10,(నినాదం ):** పటాన్‌చెరు: ఆషాఢ మాసం ముగింపు సందర్భంగా పటాన్‌చెరు పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బోనాల వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పటాన్‌చెరు శాసనసభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి మాద్రి పృథ్వీరాజ్ పలు బోనాల వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గోనెమ్మ బస్తి, ఏడు పోచమ్మ గుళ్లు, ముత్యాలమ్మ గుడి, చైతన్యనగర్ పోచమ్మ గుడి, కింది బస్తి, ఎంజీ రోడ్డు, సీతారామయ్య కాలనీ, అంబేద్కర్ కాలనీ, శాంతినగర్, జేపీ కాలనీ, వెంకటేశ్వర కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరిపై అమ్మవారి కృప ఉండాలని, పటాన్‌చెరు నియోజకవర్గం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతూ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆషాఢ మాసం ముగింపు బోనాలతో పటాన్‌చెరు పట్టణం భక్తి, ఆనందం, ఆధ్యాత్మికతతో నిండిన పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. డప్పుల మోతలు, పోతరాజుల సందడి, అమ్మవారికి సమర్పించిన బోనాలు, మహిళల భక్తిశ్రద్ధలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పృథ్వీరాజ్ పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న ఆచారాలను పరిరక్షిస్తూ భక్తిశ్రద్ధలతో పండుగను



నిర్వహించడం తెలంగాణ సంప్రదాయ వైభవానికి నిదర్శనమని అన్నారు. ప్రజలంతా ఐకమత్యంతో సుఖశాంతులతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.

# పసిడి పరుగో.. పరుగు

**ఒక్కరోజే రూ.3,800 పెరిగిన తులం ధర**



న్యూఢిల్లీ, ఆగస్టు 6: బంగారం ధరలు వరుసగా మూడోరోజూ పెరిగాయి. గురువారం ఒక్కరోజే ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల రేటు రూ.3,800 ఎగిసింది. దీంతో 7 వారాల గరిష్ఠ స్థాయిని తాకుతూ రూ.1,53,800కు చేరింది. జూన్ 18 (రూ.1,53,400) తర్వాత ఇదే అత్యధికం మరి. అంతకుముందు రెండు రోజుల్లో రూ.2,600 పెరిగిన విషయం తెలిసిందే. ఇక వెండి ధరల విషయానికొస్తే.. రూ.2,100 పుంజుకొని కిలో రూ.2,34, 800 పలికింది. బుధవారం రూ.6,200 ఎగబాకిన సంగతి విదితమే. కాగా, హైదరాబాద్‌లో 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) 10 గ్రాముల విలువ రూ.2,650 పెరిగి రూ. 1,37,250గా ఉన్నది. బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు మళ్లీ పెరుగుతూపోతుండటం వెనుక అనేక కారణాలున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో నెలకొన్న అశాంతి తొలగిపోతుండటం, హొర్ముజ్ జలసంధిలో తిరిగి నౌకల రవాణాకు మార్గం సుగమమయ్యే అవకాశాలు కనిపిస్తుండటం, అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పడుతుండటం ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. క్రూడాయిల్ రేట్లు దిగితే ద్రవ్యోల్బణం భయాలు తొలగిపోనుండటం, తద్వారా అమెరికా ఫెడ్ రిజర్వ్, ఆర్బీఐ సహా ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్ల పెంపు జోలికి వెళ్లవన్న అంచనాలు మదుపర్లలో నెలకొనడం కూడా గోల్డ్, సిల్వర్‌కు డిమాండ్‌ను తెచ్చిపెడుతున్నదని అంటున్నారు. అలాగే డాలర్ విలువ, అమెరికా బాండ్ రాబడులు సైతం మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నట్టు గుర్తుచేస్తున్నారు.

**అంతర్జాతీయ మార్కెట్‌లో..**

అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 4,264.24 డాలర్లు పలికింది. సిల్వర్ 61.80 డాలర్ల వద్ద నిలిచింది. మరోవైపు ఫ్యూచర్ మార్కెట్‌లోనూ బంగారం ధరలు దూసుకుపోతున్నాయి. గురువారం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)పై అక్టోబర్ డెలివరీకిగాను రూ.654 పెరిగి రూ.1,49,147 వద్ద ట్రేడైంది. మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడితే అటు స్పాట్ మార్కెట్‌లో, ఇటు ఫ్యూచర్ మార్కెట్‌లోనూ ధరలు పరుగులు పెట్టడం ఖాయమని ట్రేడర్లు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది జనవరి 29న దేశీయంగా 24 క్యారెట్ గోల్డ్ తులం మునుపెన్నడూ లేనివిధంగా రూ.1,83,000 పలికినది తెలిసిందే. కిలో వెండి తొలిసారి రూ.4,04,500గా నమోదైంది. అయితే గల్ఫ్ వార్ దెబ్బకు బంగారం ధర దాదాపు రూ.40,000 వరకు, వెండి రేటు సుమారు రూ.1,80,000 వరకు క్షీణించాయి.




## రూ.949లకే ఏఐ అసిస్టెంట్ ఫోన్

సామాన్యులకు సైతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చౌకగా అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో ప్రముఖ మొబైల్ బ్రాండ్ 'ఐటెల్' భారత మార్కెట్లో సరికొత్త 'ఏస్ 3 హీరా' ఫీచర్ ఫోన్‌ను ఆవిష్కరించింది. కేవలం రూ.949 ధరకే లభించే ఈ డివైజ్ ఫీచర్ ఫోన్ విభాగంలో డిజిటల్ సౌలభ్యానికి అందిస్తున్నట్లు కంపెనీ చెప్పింది. ఈ కొత్త ఫోన్ విడుదలతో భారతదేశంలో తన పూర్తి ఫీచర్ ఫోన్ పోర్ట్‌ఫోలియోను యూఎస్‌బీ టైప్-సీ చార్జింగ్‌కు మార్చినట్లు తెలిపింది. స్మార్ట్‌ఫోన్‌లు, ఫీచర్ ఫోన్‌లకు వేర్వేరు చార్జర్లు వాడే ఇబ్బందిని తప్పించి ఒకే కేబుల్‌తో ప్రతి ఒక్కరూ చార్జింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించడమే తమ ముఖ్య ఉద్దేశమని కంపెనీ సీఈఓ అరిజీత్ తలపాత్రా పేర్కొన్నారు. కంపెనీ తెలిపిన వివరాల ప్రకారం.. 1,000ఎంఏహెచ్ బ్యాటరీతో పాటు ఏఐ బ్యాటరీ ఆప్టిమైజేషన్, సూపర్ బ్యాటరీ మోడ్ ఫీచర్లు ఉన్నాయి. రికార్డింగ్ ఆప్షన్‌తో కూడిన వైర్‌లెస్ ఎఫ్ఎమ్ రేడియో, ఆటో కాల్ రికార్డింగ్, బ్లూటూత్ సదుపాయాలు ఉన్నాయి. ఇంగ్లీష్, హిందీ భాషలకు మద్దతు ఇచ్చే 'కింగ్ టాకర్'(టెక్స్ట్-టు-స్పీచ్) ఏఐ అసిస్టెంట్‌ను అందించారు.

## పెట్రోల్ సేఫేనా?.. 87 వేల పెట్రోల్ బంకుల్లో తనిఖీలు!




ఇథనాల్ కలిపిన పెట్రోల్ నాణ్యత, కల్తీ అయ్యే అవకాశంపై ఆందోళనలు వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో చర్చ మొదలైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఇంధనంలో కల్తీ లేదా నాణ్యత లోపాలు ఉన్నాయన్న ప్రచారాన్ని దృష్టిలో పెట్టుకుని, దేశవ్యాప్తంగా కఠినమైన నాణ్యత నియంత్రణ చర్యలు అమలు చేస్తున్నామని పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ప్రజలకు అందించే పెట్రోల్ నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నామని, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రతి దశలో పరీక్షలు నిర్వహిస్తున్నాయని ప్రభుత్వం తెలిపింది. సాధారణ తనిఖీలతో పాటు.. ఎలాంటి కల్తీ జరగకుండా అదనపు పరీక్షలు కూడా చేపడుతున్నట్లు వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఉన్న 87 వేలకు పైగా పెట్రోల్ బంకుల్లో.. రోజుకు 8 నుంచి 12 సార్లు నీటి కలయిక ఉందా.. లేదా?, అనే పరీక్షలు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా.. పెట్రోల్‌లో కలుషితాలు ఉన్నాయా?, లేదా? అని తెలుసుకోవడానికి 2 వేలకు పైగా ఇంధన నమూనాలను పరీక్షించారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా కేవలం రెండు చోట్ల మాత్రమే క్లోరైడ్ కలుషిత సమస్యలు బయటపడగా, వెంటనే ఆ పెట్రోల్ బంకుల్లో విక్రయాలను నిలిపివేసినట్లు కూడా కేంద్రం వెల్లడించింది. ఈ20 పెట్రోల్ నాణ్యత అనేది వాహనం ట్యాంక్‌కు చేరిన తర్వాత మాత్రమే పరిశీలించేది కాదని కేంద్రం తెలిపింది. ఇథనాల్ తయారీ దశ నుంచే నాణ్యత తనిఖీలు ప్రారంభమవుతాయని పేర్కొంది. ముందు ఇథనాల్ నాణ్యతను పరిశీలిస్తారు. డిస్టిలరీల నుంచి వచ్చే ప్రతి బ్యాచ్ ఎథనాల్ దీ×ూ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. దాని స్వచ్ఛత కనీసం 99.6 శాతం ఉండటం తప్పనిసరి. ఇథనాల్‌ను ఆయిల్ కంపెనీల డిపోలకు పంపే సమయంలో నాణ్యత ధ్రువీకరణ పత్రం కూడా అందజేస్తారు. నాణ్యత ప్రమాణాలు పాటించని ఇథనాల్‌ను.. సరఫరా వ్యవస్థలోకి అనుమతించడం లేదని ప్రభుత్వం తెలిపింది. 2024 జూలై నుంచి 2026 జూన్ మధ్య కాలంలో 302 ట్యాంకర్లలో వచ్చిన దాదాపు 10,500 కిలోలీటర్ల ఇథనాల్‌ను ప్రమాణాలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. ఇందులో స్వచ్ఛత, నీటి శాతం, సాంద్రత వంటి అంశాల్లో లోపాలను గుర్తించారు. ఇథనాల్ నిల్వ, రవాణా సమయంలో కూడా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇతర పదార్థాలతో కలవకుండా.. ప్రత్యేక నిల్వ కేంద్రాల్లో ఉంచుతున్నారు. డిపోలకు చేరిన ప్రతి ట్యాంకర్ నుంచి పైభాగం, కింది భాగం నుంచి నమూనాలు తీసుకుని పరీక్షించిన తర్వాతే ఆమోదిస్తున్నారు.

## హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ క్లౌడ్

న్యూఢిల్లీ, ఆగస్టు 6 : టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్.. దేశంలో తమ నాల్గో క్లౌడ్ రీజియన్‌ను హైదరాబాద్‌లో అందుబాటులోకి తెచ్చినట్టు గురువారం ప్రకటించింది. దీంతో నగరం నుంచి వీలైన మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సేవలు, వర్క్‌లోడ్‌లను నడిపించడానికి ఇక కస్టమర్లకు అవకాశం లభించిందని పేర్కొన్నది. ఇప్పటికే కంపెనీకి పుణె, చెన్నై, ముంబైలు క్లౌడ్ రీజియన్‌లుగా ఉన్నాయి. దీంతో ఇప్పుడు వీటికి హైదరాబాద్ తోడైంది. కాగా, భారత్‌లో 20.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులను పెట్టేందుకు సిద్ధమైన మైక్రోసాఫ్ట్.. అందులో భాగంగానే ఈ క్లౌడ్ రీజియన్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది.




# కేకేఆర్ చేతికి మెడికవర్ ఇండియా




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారత హెల్త్‌కేర్ విభాగంలో అవకాశాలను మరింతగా అందిపుచ్చుకునే దిశగా గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం కేకేఆర్ తాజాగా భారీ డీల్‌కి తెరతీసింది. అంతర్జాతీయ వైద్యసేవల దిగ్గజం మెడికవర్ ఏబీకి చెందిన భారత విభాగం మెడికవర్ ఇండియాను కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ డీల్ విలువ ఎంతనేది కేకేఆర్ నిర్దిష్టంగా వెల్లడించకపోయినప్పటికీ.. సంస్థ విలువను 1.2 బిలియన్ యూరోలుగా (దాదాపు రూ. 13,200 కోట్లు) లెక్కగట్టినట్లు న్యాయ సలహాలందిస్తున్న ట్రైలీగల్ వివరించింది. కేకేఆర్‌కి చెందిన ఫండ్స్‌కి 100 శాతం వాటాలను విక్రయించేందుకు తమతో పాటు మైనారిటీ వాటాదారులు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మెడికవర్ తెలిపింది. దీనితో స్థూలంగా 740 మిలియన్ యూరోలు లభిస్తాయని, ఆ మొత్తంతో పోలాండ్ తదితర దేశాల్లో కార్యకలాపాలు విస్తరించనున్నట్లు పేర్కొంది. ఈ డీల్‌కి ఇదే సరైన సమయమని భావిస్తున్నట్లు కంపెనీ సీఈవో జాన్ స్టబింగ్‌టన్ చెప్పారు. మరోవైపు ప్రస్తుత మేనేజ్‌మెంటే మరో మూడేళ్ల పాటు కొనసాగుతుందని మెడికవర్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ వెల్లడించారు. సంస్థలో 14 వేల మంది ఉద్యోగులు, 1,900 మంది పైగా డాక్టర్లు ఉన్నారని, వారు కూడా యథాప్రకారంగానే కొనసాగుతారని పేర్కొన్నారు. సంస్థను మరింతగా విస్తరించే ప్రణాళికలు ఉన్నట్లు వివరించారు. నియంత్రణ సంస్థల అనుమతులకు లోబడి ఈ ఏడాది ఆఖరు నాటికి ఇది పూర్తి కావొచ్చని భావిస్తున్నట్లు వివరించారు. ప్రస్తు తం ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకలో మొత్తం నాలుగు రాష్ట్రాల్లో సుమారు 11--12 లక్షల మంది పేషంట్లకు చికిత్సలు అందిస్తున్నట్లు చెప్పారు. అటు, 'మరింత నాణ్యమైన వైద్య సేవలందించడంలో మెడికవర్ ఇండియా డాక్టర్లు, ఉద్యోగులకు మద్దతుగా నిలుస్తూ, దేశవ్యాప్తంగా అధునాతన హెల్త్‌కేర్ సర?వసులను విస్తరించేందుకు ఈ పెట్టుబడులు దోహదపడతాయి' అని కేకేఆర్ పార్ట్‌నర్ అక్షయ్ తనా తెలిపారు.

**నాలుగు రాష్ట్రాల్లో 24 ఆస్పత్రుల నెట్‌వర్క్..**

మ్యాక్స్‌క్యూర్ హాస్పిటల్ చెయిన్ ఆపరేటర్, హైదరాబాద్‌కి చెందిన సహృదయ హెల్త్‌కేర్‌లో నియంత్రణాధికారాలుండే వాటాలను కొనుగోలు చేయడం ద్వారా స్వీడన్‌కి చెందిన మెడికవర్ 2017లో భారత హెల్త్‌కేర్ మార్కెట్లోకి ప్రవేశించింది. మెడికవర్ ఇండియాలో మెడికవర్ హోల్డింగ్స్ బీవీకి 67 శాతం ఉండగా, మైనారిటీ షేర్‌హోల్డర్లయిన ప్రస్తుత సీఎండీ జి. అనిల్ కృష్ణ తదితరుల వద్ద సుమారు 33 శాతం వాటాలు ఉన్నాయి. సంస్థలో పి. హరికృష్ణ, ఎ. శరత్ రెడ్డి ఈడీలుగా, ఏఆర్ కృష్ణప్రసాద్ డైరెక్టరుగా ఉన్నారు. సుమారు 4,800 పడకలతో 24 ఆస్పత్రుల నెట్‌వర్క్ ఉంది. 80 పైచిలుకు స్పెషాలిటీల్లో సేవలు అందిస్తోంది.

**భారీ విస్తరణ బాటలో కేకేఆర్**

కేకేఆర్ 2004 నుంచి అంతర్జాతీయంగా హెల్త్‌కేర్ విభాగంలో సుమారు 20 బిలియన్ డాలర్ల పైగా ఇన్వెస్ట్ చేసింది. గత కొన్నాళ్లుగా భారత్‌లోనూ విస్తరించింది. మ్యాక్స్ హెల్త్‌కేర్‌లో భారీ లాభాలకు నిష్క్రమించిన దాదాపు నాలుగేళ్ల తర్వాత 2025లో కేరళకు చెందిన బేబీ మెమోరియల్ హాస్పిటల్ (బీఎంహెచ్)లో దాదాపు రూ. 2,500 కోట్లకు సుమారు 70 శాతం వాటాలను కొనుగోలు చేయడం ద్వారా మళ్లీ హెల్త్‌కేర్ విభాగంలోకి ప్రవేశించింది. అప్పటి నుంచి దక్షిణాది మరింతగా కార్యకలాపాలు విస్తరించింది. మైత్రా హాస్పిటల్, చళికట్టు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను కొనుగోలు చేసింది. అలాగే హెల్త్‌కేర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌లో నియంత్రణాధికారాలున్న వాటాలను దక్కించుకుంది. ఈ విభాగంలో ఫైనాన్సింగ్ కార్యకలాపాలు కూడా నిర్వహిస్తోంది.

# టాటా నెక్సాన్ కొత్త ఎడిషన్ లాంచ్: ధర ఎంతంటే?




భారతదేశంలో అత్యధిక అమ్మకాలు పొందుతున్న నెక్సాన్.. 'కామో ఎడిషన్' రూపంలో లాంచ్ అయింది. దీని ధర రూ.9.99 లక్షలు (ఎక్స్-షోరూమ్). దీనికి కంపెనీ పరిమిత సంఖ్యలో మాత్రమే విక్రయించనుంది. భారతదేశంలో నెక్సాన్ తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని, 11 లక్షలకు పైగా అమ్మకాలను సాధించిన సందర్భంగా.. ఈ కాంపాక్ట్ ఎస్‌యూవీని టాటా మోటార్స్ లాంచ్ చేసింది. అయితే ఇందులో ఎలాంటి మెకానికల్ మార్పులు లేదు, కానీ కొన్ని కాస్మెటిక్ అప్‌డేట్‌లు కొన్ని అదనపు పరికరాలను జోడించారు. నెక్సాన్ కామో ఎడిషన్ మున్నార్ మిస్ట్, కూర్గ్ క్లౌడ్ అనే రెండు కొత్త రంగుల్లో లభిస్తుంది. ఈ రంగులు కాకుండా కామో బ్యాడ్జ్‌లు కనిపిస్తాయి. క్యాబిన్‌లో కూడా ముందు సీట్ల హెడ్‌రెస్ట్‌లపై కామో థీమ్ ఉంటుంది. క్యాబిన్ లోపల 10.25-అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తో కూడిన కొత్త 12.3-అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌ను అందించారు. మరో ముఖ్యమైన ఫీచర్ ఏమిటంటే.. ఈ కారులోని నాలుగు సరౌండ్-వ్యూ కెమెరాలను ఉపయోగించి పనిచేసే ఇంటిగ్రేటెడ్ డాష్‌క్యామ్. ఇది నిరంతరంగా రికార్డ్ చేయగలదు, ప్రమాదం జరిగినప్పుడు ఫుటేజీని ఆటోమేటిక్‌గా సేవ్ చేస్తుంది, వీడియోలను ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్‌పై చూడటానికి లేదా స్మార్ట్‌ఫోన్‌కు బదిలీ చేయడానికి అనుమతిస్తుంది. వేరియంట్‌ను బట్టి.. పరికరాల జాబితాలో పనోరమిక్ సన్‌రూఫ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, బ్లైండ్ వ్యూ మానిటర్‌తో కూడిన 360-డిగ్రీ కెమెరా, జేబీఎల్ స్పీకర్ ఆడియో సిస్టమ్, వైర్‌లెస్ ఛార్జర్, కనెక్టెడ్ కార్ టెక్నాలజీ మొదలైనవి ఉన్నాయి. ఏడు ఫంక్షన్లతో కూడిన ఏడీఏఎస్ మాత్రమే కాకుండా.. ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రాం కూడా ఉన్నాయి. నెక్సాన్ కామో ఎడిషన్.. స్టాండర్డ్ మోడల్‌లో ఉన్న అవే ఇంజన్ ఆప్షన్‌లతో కొనసాగుతుంది. కొనుగోలుదారులు 1.2-లీటర్ టర్బో-పెట్రోల్ ఇంజన్, 1.5-లీటర్ డీజిల్, 1.2-లీటర్ టర్బో సీఎన్జీ యూనిట్ వంటి వాటిలో ఎంచుకోవచ్చు. వేరియంట్‌ను బట్టి, ట్రాన్స్‌మిషన్ ఆప్షన్‌లలో మాన్యువల్, ఆటోమాటిక్, డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌లు ఉన్నాయి.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# అవును పెళ్లయ్యింది. నలుగురు పిల్లలు

విమర్శకులకు నటి త్రిష ఘాటు రిప్లై కొన్ని రోజులుగా నటి త్రిష పేరు సోషల్ మీడియాలో వైరలవుతోన్న విషయం తెలిసిందే. నటుడు, టీవీకే అధినేత విజయ్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా త్రిష సినిమాలు మానేస్తున్నారని నటుడు చిత్రా లక్ష్మణన్ ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో చెప్పడం తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై ఆమె తనదైన స్టైల్‌లో కౌంటర్ ఇచ్చారు. ఇన్‌స్టా స్టోరీలో ఈ వ్యాఖ్యలపై పరోక్షంగా స్పందించారు. అవును సినిమాలు మానేశాను. ఒక పెద్ద వ్యాపారవేత్తను పెళ్లి చేసుకొని నలుగురు పిల్లల్ని కన్నాను. మీ ఊహాగానాలకు ఇది సరిపోతుందా?. ఈరోజు మీరు వార్తలు రాసుకోవడానికి ఇది చాలా.. మరేదైనా జోడించమంటారా' అంటూ వ్యంగ్యంగా రాసుకొచ్చారు.. దీంతో ఆమె సినిమాలు మానేయనున్నారంటూ వస్తోన్న వార్తలకు చెక్ పడినట్లైంది. అసలేం జరిగిందంటే.. యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు చిత్రా లక్ష్మణన్ బదులిచ్చారు. ఇకపై సినిమాల్లో కొనసాగాలని త్రిష అనుకోవడం లేదని.. అవకాశాలనూ అందిపుచ్చుకోవడం లేదన్నారు. దీంతో ఎన్నో ఊహాగానాలు మొదలయ్యాయి. ఆమె పాలిటిక్స్‌పై ఫోకస్ పెట్టనున్నారని వార్తలు వచ్చాయి. తాజా పోస్ట్‌తో వీటికి తనదైన స్టైల్‌లో త్రిష బదులిచ్చారు.





# ఆసుపత్రి పాలైన అవికా గోర్..

టెలివిజన్ ప్రేక్షకులను ఎంతగానో అలరించిన 'బాలికా వధు' (చిన్నారి పెళ్లికూతురు) ఫేమ్ అవికా గోర్ ప్రస్తుతం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఆమె ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అవికా గోర్ భర్త మిలింద్ చంద్వానీ సోషల్ మీడియా వేదికగా ఆమె ఆరోగ్య పరిస్థితిని వెల్లడించారు. గత ఐదు రోజులుగా ఆమె ఏకంగా 104 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నప్పటికీ, షూటింగ్‌కు ఎలాంటి అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో తన వృత్తిపై ఉన్న అంకితభావాన్ని చాటుకున్నారు. నిర్మాతలకు నష్టం జరగకూడదనే ఆలోచనతో ఆమె తీవ్ర అనారోగ్యంలోనూ షూటింగ్‌లలో పాల్గొనడమే కాకుండా, ఒక యాడ్ షూట్ కోసం ఢిల్లీకి కూడా ప్రయాణించారు. అయితే నీరసం మరియు జ్వరం మరింత పెరగడంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఆమె నటించిన సరికొత్త హిందీ మ్యూజిక్ ఆల్బమ్ 'బుఖార్' (జ్వరం) విడుదలైన రోజే ఆమె నిజంగానే జ్వరంతో ఆసుపత్రిపాలవడం గమనార్హం. ఆసుపత్రి మంచంపై నుంచే తన పాట విడుదలైన విషయాన్ని అభిమానులతో పంచుకున్న ఆమె, తన ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గుతోందని, డెంగ్యూ ప్రభావం చాలా తీవ్రంగా ఉందని పేర్కొంటూ విక్టరీ సింబల్ చూపించారు. బాలనటిగా కెరీర్ ప్రారంభించి దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు తెచ్చుకున్న అవికా గోర్ త్వరగా కోలుకోవాలని ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.

# సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద విషాదం..



బాలీవుడ్ అగ్రకథనాయకుడు సల్మాన్ ఖాన్ నివాసమైన ముంబై బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సల్మాన్ ఖాన్ భద్రత కోసం అక్కడ విధుల్లో ఉన్న 41 ఏళ్ల ముంబై పోలీసు కానిస్టేబుల్ గణేష్ రైతే గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ముంబై పోలీసు విభాగంలోని ఎల్‌ఏ-4 యూనిట్‌కు చెందిన గణేష్ రైతే, శుక్రవారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో గెలాక్సీ అపార్ట్‌మెంట్ వెలుపల పెట్రోలింగ్ విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో ఆయన తీవ్రమైన అశాంతి, ఛాతిలో అసౌకర్యంగా ఉన్నట్లు తోటి సిబ్బందికి తెలిపారు. క్షణాల వ్యవధిలోనే ఆయన ఒక్కసారిగా రోడ్డుపై కుప్పకూలిపోయారు. అప్రమత్తమైన తోటి పోలీసులు వెంటనే ఆయన్ను సమీపంలోని భాభా ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రికి చేరుకునేసరికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతికి గల అసలు కారణాన్ని నిర్ధారించడానికి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. కాగా, గణేష్ రైతే గతంలో భారతీయ సైన్యంలో దేశ సరిహద్దులను కాపాడటంలో సేవలు అందించారు. ఆర్మీ సర్వీస్ పూర్తి చేసుకున్న తర్వాత ఆయన ముంబై పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరి విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఆకస్మిక మృతి కుటుంబ సభ్యులలో, తోటి పోలీసు సిబ్బందిలో తీవ్ర విషాదాన్ని నింపింది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ నుంచి తరచూ వస్తున్న బెదిరింపుల కారణంగా సల్మాన్ ఖాన్‌కు ప్రస్తుతం కట్టుదిట్టమైన వై-ప్లస్(-జూశ్రీబం) భద్రత కల్పించిన విషయం తెలిసిందే. ఈ భద్రతా వలయంలో భాగంగానే నిత్యం సల్మాన్ నివాసం వెలుపల పోలీసుల పహారా కొనసాగుతోంది. ఈ భద్రతా ఇబ్బందులపై గతంలో స్పందించిన సల్మాన్ ఖాన్, తనకు దేవుడిపై నమ్మకం ఉందని, ఎంత ఆయుష్షు ఉంటే అంత బతుకుతామని, చుట్టూ రక్షణ సిబ్బందితో తిరగడం ఒక్కోసారి కష్టంగా ఉంటుందని పేర్కొన్న సంగతి తెలిసిందే.

# నాని-సుజీత్ 'బ్లడీ రోమియో'లో హీరోయిన్‌గా లెనిన్ బ్యూటీ..

మరో క్రేజీ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్?

టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్'తో బిజీగా ఉన్నారు. ఈ సినిమా పూర్తయిన వెంటనే సెన్సేషనల్ డైరెక్టర్ సుజీత్‌తో కలిసి ఓ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటించనున్నారు. ఇప్పటికే 'ఓజీ'తో తన మార్క్ చూపించిన సుజీత్ దర్శకత్వంలో నాని హీరోగా నటిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు 'బ్లడీ రోమియో' అనే విభిన్నమైన టైటిల్‌ను ఖరారు చేసినట్లు సమాచారం. గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం అక్టోబర్ నుంచి షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. నిహారిక ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించనుంది. ఇప్పటివరకు ఈ సినిమాలో నాని సరసన ఎవరు హీరోయిన్‌గా నటించనున్నారనే అంశంపై సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం యంగ్ అండ్ గ్లామరస్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేను ఈ ప్రాజెక్ట్ కోసం సంప్రదించినట్లు తెలుస్తోంది. దర్శకుడు సుజీత్, నిర్మాతలు ఇప్పటికే భాగ్యశ్రీతో చర్చలు జరిపినట్లు, కథతో పాటు తన పాత్ర నచ్చడంతో ఆమె కూడా ఈ సినిమాకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు ఫిలింనగర్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మోడలింగ్ రంగం నుంచి సినిమాల్లోకి వచ్చిన భాగ్యశ్రీ బోర్సే.. మాస్ మహారాజా రవితేజ సరసన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమయ్యారు. తొలి సినిమాతోనే తన స్క్రీన్ ప్రెజెన్స్, గ్లామర్‌తో పాటు నటనతోనూ ఆకట్టుకున్న ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ నటించిన 'కింగ్డమ్', రామ్ పోతినేని 'ఆంధ్ర కింగ్ తాలుకా' వంటి చిత్రాల్లో నటించి తన పరిధిని పెంచుకున్నారు.ఇక అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కిన 'లెనిన్' సినిమాతో భాగ్యశ్రీ బోర్సేకు మరింత క్రేజ్ వచ్చింది. ఈ సినిమాలో ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో పాటు, సినిమా విజయం ఆమెకు వరుస అవకాశాలు తెచ్చిపెడుతోంది. ఒకవైపు వరుస విజయాలతో నాని మంచి ఫామ్‌లో ఉండగా.. మరోవైపు 'ఓజీ'తో సుజీత్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ ఇద్దరి కలయికలో 'బ్లడీ రోమియో' తెరకెక్కనుండటంతో సినిమాపై ఇప్పటి నుంచే ఆసక్తి నెలకొంది. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారన్న వార్త నిజమైతే నాని--భాగ్యశ్రీ జోడీకి ఇదొక కొత్త కాంబినేషన్ కానుంది. గ్యాంగ్‌స్టర్ యాక్షన్, ఎమోషన్, స్టైలిష్ టేకింగ్‌తో సుజీత్ ఈ సినిమాను ఏ స్థాయిలో తెరకెక్కిస్తారో చూడాలి.





# రవితేజ 'ఇరుముడి' ట్రైలర్‌కు ముహూర్తం ఫిక్స్..

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి'. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది.ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ఇప్పటివరకు వచ్చిన ప్రమోషనల్ కంటెంట్‌తో సినిమాపై బజ్ క్రియేట్ చేసిన మేకర్స్.. ఇప్పుడు అతిపెద్ద ప్రమోషనల్ అప్‌డేట్‌కు సిద్ధమయ్యారు. అదే 'ఇరుముడి' థియేట్రికల్ ట్రైలర్. తాజా సమాచారం ప్రకారం ఆగస్టు 12న 'ఇరుముడి' ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది.మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. రిలీజ్‌కు కేవలం కొద్ది రోజుల ముందు ఆగస్టు 12న ట్రైలర్‌ను విడుదల చేయడం ద్వారా ప్రమోషన్స్‌ను మరింత వేగవంతం చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.




EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/